www.republichindustan.in
RNI REG.NO. TELTEL/2021/83468
# రిపబ్లిక్ హిందుస్థాన్
తెలుగు దినపత్రిక




సంపుటి: 2 సంచిక: 128 | శుక్రవారం11 సెప్టెంబరు 2026 | ఆదిలాబాద్ | హైదరాబాద్ | ఎడిటర్ : రాఠోడ్ రాజు | పేజీలు : 4 | వెల: రూ.2.00

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్...

**-డీఏల పై సీఎం రేవంత్ కీలక హామీ...**
**ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్రెడ్డితో జేఏసీ చర్చలు**
**ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తామని సీఎం హామీ**
**పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు**
**ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు**
**ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ**



**హైదరాబాద్ 10:** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న వని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్సీ కమిటీ నివేదిక అలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల వక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్రెడ్డి ఉన్నారు.

## కేటీఆర్, హరీశ్ రావు పై లైంగిక వేధింపుల కేసు..



**హైదరాబాద్ 10:** బిఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు, సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తమతో అసభ్యంగా ప్రవర్తించారని మహిళా కానిస్టేబుల్ హైదరాబాద్ లోని సైఫాబాద్ పిఎస్ లో ఫిర్యాదు చేశారు.టీషర్టులు విప్పి తమ ముందు అర్ధనగ్నంగా నిలబడ్డారని అందులో పేర్కొన్నారు. దీంతో వారిపై బిఎన్ఎస్ 74, 75(1), 79, 121(1), 130, 132, 296, 351(2), 352, 3(5) సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు.

## సమాధానం చెప్పలేక సస్పెండ్ చేస్తున్నారు

**: హరీష్‌రావు**



**హైదరాబాద్ 10:** ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు బీఆర్ఎస్ నేత హరీష్‌రావు. సమాధానం చెప్పలేకే తమను సభ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా 30 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. సర్టిఫికెట్లు అందక ఉద్యోగ, విదేశీ విద్య అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

## గంజాయి ముఠాపై పోలీసుల ఉక్కుపాదం

**: ఇద్దరు అరెస్ట్.. 1.3 కిలోల మత్తు సరుకు సీజ్**



**చిలకలూరిపేట 10:** పట్టణంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న మత్తు సామ్రాజ్యంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. సుగాలి కాలనీ ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో కొందరు యువకులు గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడుతున్నారన్న పక్కా సమాచారంతో, పట్టణ సీఐ పి.రమేష్ ఆదేశాల మేరకు ఎస్సై వి.సోమేశ్వరరావు తమ బృందంతో కలిసి మెరుపుదాడి నిర్వహించారు. పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేసిన వాంకుడవత్ పవన్ కుమార్ నాయక్ (19), మేఘవత్ మణిగోపాల్ నాయక్ (22)లను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి దాదాపు రూ. వేల విలువచేసే 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపిన సీఐ పి.రమేష్, యువత భవిష్యత్తును బలితీసుకునే గంజాయి దందాను పట్టణంలో సమూలంగా తుడిచిపెడతామని, అసాంఘిక శక్తులు ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు.



## అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి తో బీసీ సంఘాల బృందం భేటీ

జనగణలో ఓబీసీ కాలం చేర్చే విధంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలి..జాజులసంచార జాతుల విముక్తి దినోత్సవం రాష్ట్ర పండుగగా జరపాలి బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారిహైద్రాబాద్ సెప్టెంబర్ 10:అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి తో బీసీ సంఘాల బృందం కలిసింది.ఈ సందర్బంగా జాతీజనగణలో ఓబీసీ కాలం చేర్చే విధంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరుతూ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజు శ్రీనివాస్ నేతృత్వం లో ప్రతినిధుల బృందం ముఖ్య మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు.సంచార జాతుల విముక్తి దినోత్సవం రాష్ట్ర పండుగగా జరపాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కోరారు.అలాగే ఈ నెలలో హైదరాబాదులో జరిగే సంచార జాతుల విముక్తి దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరారు.సీఎంతో పాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను బృందం కలిసి విజ్ఞప్తి చేసింది.ఈ భేటీలో వడ్డెర ఫెడరేషన్ చైర్మన్ గుంజ రేణుక, సంచార జాతుల సంఘాల నేతలు కాటేపల్లి వీరస్వామి, తిప్పిరి శెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




## అనుముల బ్రదర్స్ భూ వ్యవహారంపై బీఆర్ఎస్ క్షేత్రస్థాయి పరిశీలన

**హైదరాబాద్ 10:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి చెందిన సంస్థకు కేటాయించిన భూములను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించింది. భూముల కేటాయింపు జరిగిన ప్రాంతానికి చేరుకున్న బీఆర్ఎస్ నేతలు అక్కడి నుంచే మీడియాతో మాట్లాడి ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు చేశారు.రూ.200 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించారంటూ ఆరోపణ, సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టారని విమర్శించారు. విలువైన ప్రభుత్వ భూముల కేటాయింపుపై సమగ్రంగా విచారణ జరపాలని

## గణపతి ఉత్సవాల్లో పాల్గోనాల్సిందిగా సీఎం రేవంత్ కు ఆహ్వానం



**హైదరాబాద్10:**శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా సికింద్రాబాద్ శ్రీ గణేష్ దేవాలయ కమిటీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని ఆహ్వానించింది. అసెంబ్లీలోని ఛాంబర్లో ముఖ్యమంత్రి ని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, శ్రీ గణేష్ దేవాలయ కమిటీ అర్చకులు కలిసి ఆహ్వానాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాటు పలువురు శాసనసభ్యులు ఉన్నారు.




## సొంత ప్రభుత్వంపై 'రాములమ్మ' నిప్పులు...!

**మేము పోరాడకుంటే మీరు సీఎంలు, మంత్రులు అయ్యేవారా**
**ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి**
**శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ధ్వజం**

**హైదరాబాద్10:** తెలంగాణ శాసన మండలి వేదికగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ విజయశాంతి తన సొంత ప్రభుత్వంపైనే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరిపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం మండలి సమావేశాల్లో భాగంగా జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా.. మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన కీలక హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని అగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులు లేకపోతే మీ పదవులు ఎక్కడివిసభలో విజయశాంతి తన మార్క్ యాక్షన్ స్టైల్‌లో ప్రసంగిస్తూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "తెలంగాణ ఉద్యమకారులు నాడు రోడ్లపైకి వచ్చి, లాఠీ దెబ్బలు తిని, జైళ్లకు వెళ్లకుంటే ఈరోజు ప్రత్యేక రాష్ట్రం వచ్చేదా ఆనాడు వారు చేసిన పోరాటం వల్లే కదా ఇవాళ మీరు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా చలామణి అవుతున్నారు. ఆ ఉద్యమకారులను విస్మరిస్తే ఊరుకునేది లేదు'' అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు, ప్రభుత్వ పెన్షన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను తక్షణమే

## పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**రూ.5 లక్షల ఉచిత సాయం దేశంలో ఎక్కడా లేదు..**
**తెలంగాణలోనే అమలు**
**రెండో విడతలో 59 వేల గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు**
**ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు**
**ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టీకరణ**


2వ పేజీలో...

**హైదరాబాద్ 10:** పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి,

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

**రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నభట్టి**
**ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి**
**విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం**



**హైదరాబాద్ 10:** తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

# తెలంగాణ యువత ఆర్గనైజేషన్, మల్కం చెరువు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాల పంపిణీ.

## హాజరైన హైడ్రా కమిషనర్ రంగనాథ్.



**హైదరాబాద్10:** రాయదుర్గం మలకలచెరువు వాకర్స్ అసోసియేషన్ మరియు తెలంగాణ యువత ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈరోజు మట్టి వినాయకుల విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమం చాలా ఘనంగా నిర్వహించారు ఇమ్మడి సతీష్, మల్లిఖార్జున్ నరకుడుబిందెల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్ గారు ఐపీఎస్ వినాయక మట్టి విగ్రహాల పంపిణీ చేశారు..చెరువుల పరిరక్షణలో ఎంతోమంది నా పైన కేసులు పెడుతున్నారని అయినా కూడా నేను వాటిని ఎదుర్కొని ముందుకు సాగుతున్నానాని, ప్రజల ఆస్తులైన వేల ఎకరాల కబ్జా భూములను హైడ్రా విడిపించిందని నేటి యువత ప్రధానంగా పిఒపి లేని విగ్రహాలనే ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలు చేయాలని సింథటిక్ కలర్స్ కాకుండా న్యాచురల్ కలర్స్ తో మట్టి వినాయకులని ఏర్పాటు చేసుకోవాలని దానివల్ల కాలుష్యాన్ని వీలైనంతవరకి తగ్గించవచ్చని తెలియజేశారు. ఎవరు ఎన్ని కేసులు పెట్టినా హైడ్రా అనే సంస్థ కబ్జాదారులు, భూభకాసురులని విడిచిపెట్టదని చెరువుల పరిరక్షణ కోసం ఎంతవరకైనా ఎదుర్కోవడానికి మా హైడ్రా టీం ఎప్పుడు ముందే ఉంటుందని అన్నారు. జన్ – జీ యువత ప్రధాన సమస్యల పైన పోరాటం చేయాలని ప్రకృతిని కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు మనుగడ సాధ్యమని తెలియజేశారు. ప్రధానంగా మల్కంచెరువు వాకర్ అసోసియేషన్ మరియు తెలంగాణ యువత ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించినటువంటి ఈ కార్యక్రమం ఎంతోమందికి ఆదర్శప్రాయమని ఇలాంటి కార్యక్రమాల్ని స్ఫూర్తిగా తీసుకుని చేయాలని అన్నారు తెలంగాణ యువత ఆర్గనైజేషన్ అధ్యక్షులు ఇమ్మడి సతీష్ మరియు మల్కం చెరువు వాకర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మల్లికార్జున్ నరుకుడు బిందెల మంచి సదుద్దేశంతో నా దగ్గరికి రావడంతో నేను ఈ ప్రోగ్రాం నచ్చి వెంటనే ఇక్కడికి రావడానికి ఒప్పుకున్నానని తెలియజేశారు. కార్యక్రమానికి వచ్చిన స్థానికులు వాకర్స్ వారి సమస్యలను తెలియజేస్తూ కమిషనర్ గారు చేస్తున్న వర్క్ పట్ల అభినందనలు తెలియజేశారు. తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షులు ఇమ్మడి సతీష్ గారు గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా వినాయక మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానాని నా వంతు బాధ్యతగా కాలుష్య రహిత సమాజం కోసం ప్రయత్నిస్తున్నానని భవిష్యత్తులో మీ అందరి సహకారంతో ఎన్నో కార్యక్రమాలు చేయడానికి ఎప్పుడు ముందుంటానని తెలియజేశారు. మలక చెరువు వాకర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మల్లికార్జున్ నరుకుడు బిందెల మాట్లాడుతూ కమిషనర్ రంగనాథ్ గారు చేస్తున్న కృషి భవిష్యత్ తరాలకి ఎంతో ఉపయోగపడుతుందని కమిషనర్ గారు చెప్పినట్టుగా జన్ జి యువత ప్రకృతి పట్ల బాధ్యతగా ఉండాలని ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను వాడి ప్రకృతిని కాపాడుకోవాలని తెలియజేశారు. పార్క్ అసోసియేషన్ అధ్యక్షులు పెద్దగోని సతీష్ గౌడ్ మాట్లాడుతూ గాలి, నీరు, భూమి స్వచ్ఛంగా ఉన్నప్పుడే సమాజం అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలియజేశారు.కార్యక్రమంలో భాగంగా పార్కు అసోసియేషన్ సభ్యులు రమణారెడ్డి, రాజేష్ ,మురళి, బాబ్జి, జ్ఞానేశ్వర్, మరియు షీప్స్ అండ్ గోట్ సొసైటీ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, డాక్టర్ ఎంకే రాజేష్, ప్రమోద్ కుమార్ ,రాజేశం, భాస్కర్ గౌడ్, రాజశేఖర్, భాస్కర్ పటేల్, శ్రీకాంత్, నిత్య రెడ్డి, కన్నాల సురేష్, రాజ్ కుమార్, హైడ్రోస్ సిబ్బంది స్థానిక ప్రజలు వాకర్సు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

మొదటిపేజీ తరువాయి...

సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు.నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్ గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ.1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ.19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని,



అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్ల, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## చాకలి ఐలమ్మ పోరాటం

# నేటి తరానికి స్ఫూర్తిదాయకం

## అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 10:**అణగారిన వర్గాల హక్కులు, సామాజిక సమానత్వం, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మందిరంలో గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ అనిల్ మర్మాట్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగలతతో కలిసి యువరాజ్ మర్మాట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ప్రజల భూమి, భూమి హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, పోరాటపటిమ నేటి తరానికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి నదీం మాజిద్, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమర్జనం స్థల పరిశీలన

**హుజురాబాద్ టౌన్, సెప్టెంబర్ 10:**
హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి శ్రీ రొంటాల సుహాసిని మనోజ్ రావు గారు పట్టణంలో వినాయక నిమర్జనం స్థలాన్ని పరిశీలించడం జరిగింది . ఈ కార్యక్రమంలో కమిషనర్ కిషన్ మేనేజర్ భూపాల్ రెడ్డి ఏసీపీ మాధవి జ× కరుణాకర్ వార్డు కౌన్సిలర్స్ కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# సొంత ప్రభుత్వంపై 'రాములమ్మ' నిప్పులు!'

మొదటిపేజీ తరువాయి...

నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీపై 'క్వాలిటీ' అస్త్రం..×ఉద్యమకారుల అంశంతో పాటు రాష్ట్రంలో పేద ప్రజారోగ్యంపై విజయశాంతి ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులు సామాన్యులను పీల్చి పిప్పి చేస్తున్నాయని మండిపడ్డారు. ఆరోగ్య రంగంలో ప్రభుత్వం 'క్వాలిటీ' (నాణ్యత) పెంచాల్సిన అవసరం ఉందని, వైద్య సేవలు అందక పేదలు అల్లాడుతుంటే చూస్తూ ఊరుకోలేమని స్పష్టం చేశారు. స్వపక్షాన్ని ఉద్దేశించి ఆమె చేసిన ఈ సంచలన వ్యాఖ్యలతో సభ ఒక్కసారిగా నిశ్శబ్దంలో మునిగిపోయింది. ప్రతిపక్ష సభ్యులు సైతం రాములమ్మ వ్యాఖ్యలకు మద్దతుగా డెస్కులు చరిచారు. మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలను సొంత పార్టీ ఎమ్మెల్సీయే ఎండగట్టడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



# అనుముల బ్రదర్స్ భూ వ్యవహారంపై

## బీఆర్‌ఎస్ క్షేత్రస్థాయి పరిశీలన

మొదటిపేజీ తరువాయి...

డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి అన్నదమ్ములకు నో రూల్స్ అంటూ కేటీఆర్ విమర్శలుఅనుముల బ్రదర్స్ భూ వ్యవహారంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో స్పందించారు. లక్ష రూపాయల చెల్లింపు మూలధనంతో, కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని సంస్థకు ఇంత విలువైన రక్షణ రంగ ప్రాజెక్టు భూమిని ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ఒక రకమైన నిబంధనలు, సామాన్య ప్రజలకు మరో రకమైన నిబంధనలు అమలు చేస్తున్నారనే భావన కలుగుతోందని విమర్శించారు.ఫోర్త్ సిటీ అభివృద్ధి పేరుతో భూముల దందా: హరీశ్‌రావుఫోర్త్ సిటీ అభివృద్ధి పేరుతో వెనుకబడిన ప్రాంతాల భూములను ప్రభుత్వం సేకరిస్తూ, వాటిని సంస్థల ముసుగులో వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. షెల్ కంపెనీల పేరుతో బంధువుల రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నారని విమర్శించారు.ప్రభుత్వ భూముల కేటాయింపులు, వాటి వెనుక ఉన్న వ్యవహారాలపై సమగ్ర



విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. నిరుపేదల భూములు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్‌ఎస్ క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగించడంతో పాటు న్యాయపరంగానూ ముందుకు వెళ్తుందని వారు స్పష్టం చేశారు.

# పోలీస్అటవీ శాఖల మధ్య మరింత సమన్వయంతో అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు చర్యలు

## :జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల10:**జిల్లాలో అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు పోలీస్, అటవీ శాఖలు పరస్పర సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, సూచించారు. ఈ రోజు జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో పోలీస్, అటవీ శాఖల అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లాలో అటవీ పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న చర్యలు, ఇరు శాఖలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరస్పర సహకారం అవసరమైన అంశాలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలు, అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేట, అటవీ భూముల ఆక్రమణ తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అటవీ భూములు ఆక్రమణ, అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచాలని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై సమాచారాన్ని సేకరించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు, అటవీ శాఖకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పోలీస్ శాఖతో పంచుకోవాలని సూచించారు.అటవీ భూముల ఆక్రమణకు సంబంధించిన




అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ పేర్కొన్నారు. అటవీ భూముల్లో అనధికారికంగా చేపడుతున్న కార్యకలాపాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వేటగాళ్ల కదలికలపై నిఘా పెంచాలని, అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలతో సమన్వయం చేసుకుని అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని తెలిపారు.అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వన్యప్రాణుల వేట, కలప అక్రమ రవాణా, అటవీ భూముల ఆక్రమణ వల్ల కలిగే నష్టాలపై వివరించాలని సూచించారు.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

మొదటిపేజీ తరువాయి...

మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30?40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150?200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు.డ్రాలో పారదర్శకత.. అనర్హులకు చోటు లేదుఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు.రూ.5 లక్షలు ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు.8 లక్షల ఇళ్లకు సుమారు రూ.40 వేల కోట్ల భారంమొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500



కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.చిన్న లోపాలతో ఆగిన 3,200 ఇళ్లకు పరిష్కారంమొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

R. HINDUSTAN
RNI REG. NO. TELTEL/2021/83468
రిపబ్లిక్ హిందుస్థాన్
తెలుగు దినపత్రిక

# గణేష్ ఉత్సవాలపై సమన్వయ సమావేశం

**సిర్పూర్(యు),కెరమెరి సెప్టెంబరు 10:** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు గురువారం పోలీస్‌స్టేషన్‌లో మండపాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో ఎస్సై రాజు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైరాజు,గణేష్ పోర్టల్--2026లో మండపాల వివరాల నమోదు, విగ్రహం ఏర్పాటు ప్రదేశం, ఎత్తు, జియో ట్యాగింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యుత్, ఫైర్ సేఫ్టీ, ట్రాఫిక్, నిమజ్జన రూట్, ఇమర్షన్ పాయింట్లపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు.ప్రతి మండపం వద్ద రాత్రి కనీసం ముగ్గురు వ్యక్తులతో భద్రత ఏర్పాటు చేసుకోవాలని, పెద్ద మండపాల వద్ద 5 నుంచి 10 మంది వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల్లో సీసీ కెమెరాలు, పండల్ రిజిస్టర్, పాయింట్ బుక్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, ఫైర్ క్రాకర్స్ వినియోగించరాదని, రాత్రి 10 గంటలలోపు



సౌండ్‌సిస్టమ్ నిలిపివేయాలని స్పష్టం చేశారు.నిమజ్జనానికి పోలీసుశాఖ సూచించిన మార్గాన్నే వినియోగించాలని, ట్రాఫిక్ నిబంధనలు, వన్‌వే విధానాన్ని పాటించాలని సూచించారు. బ్లూ కోల్ట్స్ బృందాలు, పోలీసు అధికారులు మండపాలను నిరంతరం తనిఖీ చేస్తారని, అవసరమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సోషల్ మీడియాపైనా నిఘా ఉంటుందని, సమస్యలు తలెత్తే అవకాశం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని నిర్వాహకులను కోరారు. సమావేశంలో ఎంపిడిఓ అంజత్ పాషా, తహసీల్దార్ నాగార్జున, సర్పంచ్ పెందూర్ ఆనంద్ రావు,ఉప సర్పంచ్‌వాగ్మారె శ్రీకాంత్,గ్రామపంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్,విద్యుత్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఎం.ఎల్.ఎస్. పాయింట్ల వద్ద నిల్వల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 10:** జిల్లాలోని అన్ని ఎం.ఎల్.ఎస్. పాయింట్ల వద్ద నిలువల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఎ.సి.ఎస్.ఓ. తో కలిసి ఇన్‌చార్జీలు, డి.ఈ.ఓ.లు, స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎం.ఎల్.ఎస్. పాయింట్ల వద్ద ఉన్న నిల్వల పంపిణీ ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత ఇన్‌చార్జీలను ఆదేశించారు. స్టాక్ తరలింపులో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులు అవసరానికి



అనుగుణంగా తగినన్ని వాహనాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకుని, అందుబాటులో ఉన్న నిల్వలను సకాలంలో తరలించాలని ఆదేశించారు. నిల్వల తరలింపు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైమరీ పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 10:** రెబ్బెన మండలాల్లోని పూర్వ ప్రాథమిక (ప్రీ-ప్రైమరీ) పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యువరాజ్ మర్మత్ అధికారులను ఆదేశించారు.గురువారం మండలంలోని బుర్గూడ, రెబ్బెన మండలంలోని తల్లాలపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ప్రీ-ప్రైమరీ పాఠశాలలను సందర్శించిన అదనపు కలెక్టర్ పాఠశాలల ఆవరణలో చేపడుతున్న సుందరీకరణ, పెయింటింగ్ పనులను పరిశీలించారు. చిన్నారులకు ఆహ్లాదకరమైన, ఆకర్షణీయమైన వాతావరణం కల్పించేలా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**చిన్నారులతో ముచ్చటించిన అదనపు కలెక్టర్**

పర్యటనలో భాగంగా పాఠశాల



చిన్నారులతో అదనపు కలెక్టర్ సరదాగా ముచ్చటించారు. వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారిని ఉత్సాహపరిచారు.ప్రీ-ప్రైమరీ స్థాయిలోనే పిల్లలకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించడం ద్వారా ప్రాథమిక విద్యకు బలమైన పునాది వేయవచ్చని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు చిన్నారుల ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈపర్యటనలో స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 10:** రీ -సర్వే ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రీ-సర్వే ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రీ-సర్వేకు సంబంధించిన కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ, వివరాల నమోదు తదితర అంశాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి సంబంధించి రికార్డుల హక్కుల నవీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఆర్.ఓ.ఆర్. లో వివరాల నవీకరణ చేపట్టేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణిక విధానాల ప్రకారం అన్ని చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రీ-సర్వే ప్రక్రియలో



భాగంగా భూ రికార్డుల పరిశీలన, పాత రికార్డులతో నూతన రికార్డుల అనుసంధానం, కో-రిలేషన్ రిజిస్టర్ నిర్వహణ తదితర అంశాలలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**,మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 10:** సామాజిక అన్యాయాలు, దోపిడీ, అణచివేతను ఎదురించి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పట్టుదల నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. వెట్టి చాకిరీ, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి మహిళా చైతన్యానికి, సామాజిక న్యాయానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో



పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణేశ విగ్రహాలను పంపిణీ చేసి మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా జలవనరుల కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. రసాయనిక రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 10:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026లో హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ క్రమంలో



మార్కింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల విచారణ వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలని, ఎస్.ఐ.ఆర్.--2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాలకులు మారినా.. సమస్యలు తీరలే

**ఏ ఒక్కరి కోసం కాదు.. అన్నిగ్రామాల కోస**

**జేఏసీ అధ్యక్షుడు మడావి గుణవంత్ రావు**

**కమ్యూనిటీ హాల్లో అఖిలపక్ష సమావేశం**

**తిర్యాణి 10:** ఏండ్లుగా పాలకులు మారుతున్నా తిర్యాణి మండలంలోని గ్రామాల సమస్యలు మాత్రం తీరడం లేదని జేఏసీ అధ్యక్షుడు మడావి గుణవంత్ రావు అన్నారు. మండల అభివృద్ధి కోసం జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని కొమురం భీం కమ్యూనిటీ హాల్లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలు కూడా చాలా గ్రామాలకు పూర్తిస్థాయిలో అందకపోవడం బాధాకరమన్నారు. తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో కొన్ని అభివృద్ధి పనులు చేపట్టామని, ఆ తర్వాత గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. గ్రామాల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి ప్రజలంతా కలిసి ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జేఏసీ పోరాటం ఏ ఒక్క వ్యక్తి, రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని స్పష్టం చేశారు. మండలంలోని ప్రతి



గ్రామానికి న్యాయం జరిగేలా అన్ని వర్గాలను కలుపుకొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. గతంలో ఇచ్చిన పిలుపునకు ఆశించిన స్పందన రాలేదని.. ఇకనైనా యువత, మహిళలు, గ్రామ పెద్దలు, పటేళ్లు పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని కోరారు. ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో భగవంత్ రావు, జువ్వాజీ అనిల్‌గౌడ్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, రంగు లచ్చగౌడ్, జేఏసీ సభ్యులు, వివిధ పార్టీల మండల అధ్యక్షులు, కుల సంఘాల ప్రతినిధులు, గ్రామ పటేళు,, యువత పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**తిర్యాణి 10:** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిర్యాణి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని గురువారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ఈ కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన తిరుపతి, మహేష్, రవి, సందీప్, సునీత, రమాదేవి, కేజీబీవీలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న సరస్వతి, ఐఈఆర్‌పీ సుమన్‌లను తిర్యాణి మండల విద్యాధికారి కె. అంజయ్య ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర



ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం ద్వారా మిగతా ఉపాధ్యాయుల్లో కూడా మరింత స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, శ్రీనివాస్, దత్తుమూర్తి, సోమశేఖర్, శ్రీనివాస్,ఎస్ ఈ ఆర్ పి యశ్వంత్, మండలంలోని ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీపీఎం జాడేదీ.. పోస్టాఫీసు గతేదీ..?

**తిర్యాణి 10:** మంగి పరిధిలోని పోస్టాఫీసుకు బీపీఎం క్రమం తప్పకుండా రాకపోవడంతో 'సేవల కోసం పోస్టాఫీసుకు వెళ్లాలా.. బీపీఎం కోసం వెతకాలా?' అన్న పరిస్థితి గ్రామస్థుల్లో నెలకొంది. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పోస్టల్ కార్యకలాపాలు సక్రమంగా సాగడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రజలకు సేవలందించాల్సిన కార్యాలయం తాళం వేసినా, తెరిచి ఉన్నా పెద్దగా తేడా కనిపించడం లేదని ఎద్దేవా చేస్తున్నారు. ఇక నిర్వహణ లేక పోస్టాఫీసు భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. గోడలు, పైకప్పు పరిస్థితి చూస్తే 'పోస్టాఫీ సా.. పురాతన కట్టడమా' అనే అనుమానం కలుగుతోందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా



సంబంధిత అధికారులు స్పందించి బీపీఎంను క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా చూడటంతో పాటు భవనానికి మరమ్మతులు చేపట్టి పోస్టల్ సేవలను గాడిలో పెట్టాలని కోరుతున్నారు.

# బోడగుట్ట జాతరకు సర్వం సిద్ధం

**భక్తుల రాకకు విస్తృత ఏర్పాట్లు.. పటిష్ట బందోబస్తు**
**ముగ్గురు ఎస్సైలతో పాటు 30 మంది పోలీసుల మోహరింపు**
**ట్రాఫిక్, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి**



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 10:** వాంకిడి భవాని మాత, ఎల్లమ్మ తల్లి బోడగుట్ట జాతరకు సర్వం సిద్ధమైంది. వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం జాతర నిర్వహించనున్నారు.జిల్లా లోని చుట్టుపక్కల గ్రామాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో గ్రామపంచాయతీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రాకపోకలు, వాహనాల పార్కింగ్ తదితర సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు.

**ఏటా ప్రత్యేక పూజలు....**

భవాని గుట్టపై ఎల్లమ్మ తల్లి కొలువై ఉందని భక్తుల విశ్వాసం. ఏటా పొలాల అమావాస్య మరుసటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఏళ్ల నుంచి తరతరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించే బోడగుట్ట జాతరకు భక్తుల్లో ప్రత్యేక ఆదరణ ఉంది. మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు గుట్టకు చేరుకోనున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**పోలీసుల పరిశీలన.**

జాతర ఏర్పాట్లను వాంకిడి సీఐ వేణుగోపాల్, ఎస్సై మహేందర్ పరిశీలించారు. జాతర ప్రాంగణం, గుట్టకు వెళ్లే మార్గం, భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి భద్రతా చర్యలపై సమీక్షించారు. రద్దీ పెరిగే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.

**30 మంది పోలీసులతో బందోబస్తు..**

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు ఎస్సైలతో పాటు సుమారు 30 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బందిని మోహరించి గుట్ట పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేయనున్నారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతోపాటు గుట్టకు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టనున్నారు.

**పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం..**

జాతరకు వచ్చే భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. గుట్టకు వెళ్లే మార్గంలో వాహనాలను నిలిపివేయకుండా పోలీసులు నియంత్రించనున్నారు. రద్దీ సమయంలో వాహనదారులు పోలీసుల సూచనలు పాటించాలని అధికారులు కోరారు. భక్తులు కూడా క్రమశిక్షణతో వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

సమన్వయంతో ఏర్పాట్లు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామస్థులు, యువత, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు సర్పంచ్ మొహార్లే బాపూజీ తెలిపారు. అమ్మవార్లను ప్రశాంతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేలా అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. జాతర విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

**భక్తులతో ఆధ్యాత్మిక సందడి**

బోడగుట్ట జాతరతో సరండి గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. ఉదయం నుంచే భక్తుల రాకతో గుట్ట పరిసరాలు సందడిగా మారనున్నాయి. అమ్మవార్ల దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ, పోలీసు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## పటిష్ట భద్రతా చర్యలు



"బోడగుట్ట జాతరకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం. ముగ్గురు ఎస్సైలతో పాటు సుమారు 30 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు నియమించాం. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశాం. గుట్టకు వెళ్లే మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో అమ్మవార్ల దర్శనం చేసుకోవాలి. జాతర ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాం."

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్**
**తిర్యాణిలో ఐలమ్మ 41వ వర్ధంతి**



**తిర్యాణి 10:** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రజకుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి ఆదుకోవాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేయాలని రజక సంఘం అధ్యక్షుడు బూసి సంతోష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు నల్లూరి రాజు, దురిశెట్టి సతీష్, నల్లూరి సాగర్, జగదీష్, బూసి రవి తదితరులు పాల్గొన్నారు.

# నేటి మొక్క.. రేపటి నీడ..!



**తిర్యాణి, 10:** నేడు నాటిన మొక్కే రేపటి ప్రయాణికుడికి నీడనిస్తుందంటూ కౌటగం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రబండ, తాటిగూడ గ్రామాల ప్రజలు పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. రహదారి పక్కన మొక్కలు నాటి పచ్చదనం పెంచారు. ఎండాకాలంలో ప్రయాణికులకు నీడతోపాటు గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. మొక్కలు నాటి చేతులు దులుపుకోకుండా వాటికి నీరు పోసి సంరక్షిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి వద్ద, ప్రతి రహదారి వెంట మొక్కలు నాటి.. వాటిని బతికించే బాధ్యతను అందరూ తీసుకోవాలని గ్రామస్థులు పిలుపునిచ్చారు.

# నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**
**ఎస్ఐ సుబ్బారావు**



**తిర్యాణి 10:** గణపతి మండపాల ఏర్పాటులో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ సుబ్బారావు అన్నారు. మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయొద్దని, పోలీసుశాఖ నుంచి ఆన్‌లైన్ అనుమతితోపాటు విద్యుత్‌శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ వైర్లు, అలంకరణలు ఏర్పాటు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సౌండ్ సిస్టమ్ వినియోగంలోనూ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి మండపం వద్ద బాధ్యతగల వాలంటీర్లను నియమించాలని, భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రివేళల్లో మండపాల వద్ద నిఘా ఉంచి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలన్నారు. పోలీసుశాఖ సూచనలు, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వంశీ, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ గణపతి మండళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఊర్లోనే ఉపాధి.. నైపుణ్య శిక్షణ

**ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐ, ఉట్నూర్ ఫ్యాకల్టీ దుర్గం మల్లయ్య**
**స్వయం ఉపాధి శిక్షణలపై అవగాహన సదస్సు**



**లింగాపూర్ 10:** గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు నైపుణ్య శిక్షణ అందించి స్థానికంగానే ఉపాధి అవకాశాలు పొందేలా ప్రోత్సహిస్తున్నామని ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐ, ఉట్నూర్ ఫ్యాకల్టీ దుర్గం మల్లయ్య అన్నారు. మండలంలోని గుమ్మునూర్-కే గ్రామంలో గురువారం ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐ, ఉట్నూర్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా యువత తమలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. వివిధ వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ పొందడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని తెలిపారు. ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 21 నుంచి ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, హౌస్ వైరింగ్ శిక్షణలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న యువతీ యువకులు ఉట్నూర్‌లోని ఎస్బిఐ ఆర్ఎస్ఈటిఐ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8096093085, 9949412159 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్షియల్ లిటరసీ ప్రతినిధి రంజిత్, గ్రామ పటేల్, గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

# ఐక్యతకు ప్రతీక.. పొలాల అమావాస్య

**గ్రామ పెద్దలను శాలువాలతో సన్మానం**



**లింగాపూర్ 10:** మండల కేంద్రంలో పొలాల అమావాస్య పండుగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. మాన్కరి రాథోడ్ కవిందర్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా వేడుకలు జరిపారు. గ్రామ నాయక్, రాథోడ్ కిరణ్ కారోబారి, సర్పంచ్ రాథోడ్ శివలాల్, జాదవ్ రాజశేఖర్, భజన మండలి సభ్యులు, కవి గాయకులు, పటేల్‌లు, గ్రామ పెద్దలను శాలువాలతో సత్కరించారు. అనంతరం హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామస్థులు తమ ఎడ్లను రంగురంగులుగా అలంకరించి హనుమాన్ మందిరం చుట్టూ భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం గ్రామ పటేల్ మెస్రం గంగు చేతుల మీదుగా సంప్రదాయబద్ధంగా తోరణం తెంపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత ఎడ్లను ఇళ్లకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.లింగాపూర్‌లో 1960 నుంచి పొలాల అమావాస్య పండుగను దళిత, బహుజన, ఆదివాసీ, లంబాడా సమాజాల ప్రజలు సోదరభావంతో కలిసి జరుపుకొంటున్నారని గ్రామ పెద్దలు తెలిపారు. వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ.. భిన్న సామాజిక వర్గాల మధ్య ఐక్యత, పరస్పర గౌరవాన్ని చాటుతోందన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక సందడి నెలకొంది. చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామస్థులంతా ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# పండుగను సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలి

**మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం"**
**జిల్లా అధికారులకు మట్టి వినాయక ప్రతిమలు అందించిన కలెక్టర్, ఎస్పీ**
**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ సెప్టెంబర్ 10:**వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో బావయ్య లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి వినాయక చవితి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను నిర్వహించాలని తెలిపారు.జిల్లా అధికారులకు మట్టి వినాయక ప్రతిమలు అందించిన కలెక్టర్ ,ఎస్పీసమావేశం అనంతరం జిల్లా అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు గణపతి ప్రతిమలు అందించారుకలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు మరియు ఇతర జల వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా జల వనరుల పరిరక్షణకు తోడ్పడటంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ ,రెవిన్యూ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ , విద్యుత్ , ఫైర్ , ఆర్ అండ్ బి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వివిధ శాఖల అధికారులు, , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఊరంతా ఒక్కటై.. పొలాల పండుగకలిసుంటేనే.. పండుగ కళ

**తిర్యాణి 10:** పండుగ అంటేనే కలిసిమెలిసి చేసుకునే సంబరం.. అందులోనూ ఆదివాసీ పల్లెల్లో జరిగే పొలాల పండుగకు ప్రత్యేకత ఉంటుంది. తిర్యాణి ప్రాంతంలోని పలు పల్లెల్లో గురువారం సాయంత్రం గ్రామస్థులంతా ఒక్కటై పొలాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ పటేల్ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు.అనంతరం తోరున్‌కోటి ఎద్దులను ఆలయం చుట్టూ ఐదుసార్లు తిప్పి సంప్రదాయాన్ని పాటించారు. అనంతరం ఎద్దులను ఇంటింటికీ తీసుకెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద పండుగ సందడి కనిపించింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పొలాల పండుగ సందర్భంగా గ్రామస్థులంతా భేదాభిప్రాయాలను పక్కనపెట్టి ఒకే వేదికపైకి వచ్చారు. గ్రామ పెద్దలు సంప్రదాయాలను ముందుండి నడిపించగా.. యువత, మహిళలు ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. పూర్వీకుల ఆచారాలను కొనసాగించడంతోపాటు గ్రామంలో పరస్పర ఆప్యాయత, ఐక్యతను పెంపొందించేలా వేడుక సాగింది. దీంతో పల్లెల్లో సాంస్కృతిక సందడి నెలకొంది.